# హంతకుడు

వెనకనుండి ప్రళయం తరుముకొస్తున్నట్టుగా నల్లని మేఘాలు ఎగిరివచ్చి ఆకాశంనిండా వ్యాపించాయి. అట్టే రాత్రికూడా కాలేదు. ఐనా మేఘాలు దట్టంగా అల్లుకుని చీకట్లవానను కురిపిస్తున్నాయి. ఆరోజు ఊరు వేగంగా నిద్రపోయింది. తమ్మయ్య చుట్టకాల్చుకుంటూ వీధి అరుగుచివర కూర్చుని ఆకాశంవంక చూసి విసుక్కున్నాడు- 'వెధవమబ్బు యిప్పుడే వేయాలా'.

అర్ధరాత్రి దాటేవరకు తమ్మయ్య అలానే కూర్చున్నాడు. ఆ కూర్చోవడంలో చలనం లేదు. చూపుల్లో కదలికలేదు. నిటారుగా ములుకుల్లా గుచ్చుకునేట్టున్న అతని చూపుల చివర అతిముఖ్యమైన, రహస్యమైన ఒకపని పూర్తికావలసివుంది.

మేఘాలు కదలకుండా ఎలావున్నవి అలానే వుండిపోయాయి. వర్షంమాత్రం పడడంలేదు. తమ్మయ్య కాండ్రించి ఉమ్మేసి అరుగుదిగి చీకట్లలో కరిగిపోయాడు.

అలా మాయమైనవాడు అరగంటలో మైలుదూరం ఆవల ఊరవతల పట్నంరోడ్డుమీద మెరుపులో జిగేల్‌మని మెరిసాడు. ఆ మెరుపులో అతనికి మట్టిబాట నిటారుగా నుంచొని వెళ్ళేకొలది సన్నబడి చెట్లలో కలిసిపోయి కనిపించింది. ఆ బాటకు అటూ యిటూ పెరిగిన కొమ్మలు ఒకదాన్నొకటి పెనవేసుకుని బాటమీదకు వంగి చీకటి గుహలా అనిపించింది.

ఆ బాటమీద అతను నడుస్తున్నాడు. అతని కళ్ళు రెండూ రెండు చింతనిప్పుల్లా మండుతున్నాయి. అతను పూర్తిగా చీకట్లో కరిగి నల్లని క్రీనీడలా కదుల్తూ పోతున్నాడు. అతని హృదయంలో ఆవేశాల కార్చిచ్చు రగుల్కొని కోపాల కట్టెల సాయంతో దయాదాక్షిణ్యాల కారడవుల్ని కాల్చివేస్తోంది. అలా కాలుతున్నప్పుడు కర్కశత్వపు ఎర్రనికాంతి కళ్ళల్లో చిందులు తొక్కుతోంది. నిశ్చయాల నిట్టూర్పులు వెచ్చని జ్వాలల్లా బయటపడి చుట్టూరా ఎగురుతున్నాయి. అతను నడుస్తున్నప్పుడు ఆ నడిచిన నడకలో కర్తవ్యాన్ని స్థిరపరచుకుని కర్కశత్వాన్ని పుణికిపుచ్చుకుని దైన్యాన్ని దిగవిడిచిన ఠీవి కనిపిస్తోంది.

అతనిలోని ప్రతి అణువూ కసితో ఎర్రబడి కోపంతో కంపించిపోతోంది. అతని కళ్ళల్లో ఎక్కడో మైలుదూరంలో ఎత్తయిన గోడల భవంతిలో విందారగిస్తోన్న రంగరాజు అధికారపు హోదాలో, ధనగర్వం మఖ్మల్‌బట్టల్లో పంచదార పాయసాల్ని జుర్రుతూ కదిలాడు.

తమ్మయ్య కసిగా కుడిచేతి పిడికిలితో ఎడమచేతి అరచేతిలో గుద్దుకున్నాడు. ఒకసారి పళ్ళు బిగించి గట్టిగా ఊపిరితీసివదిలాడు. ఆ వదిలినగాలి అతనిచుట్టూ గిరగిరా బొంగరంలా తిరిగింది.

తమ్మయ్య మనసులో అంతులేని ఆలోచనల చైను గుండ్రంగా తిరుగుతోంది. వచ్చినవే వస్తూ వెళ్ళినవే వెళ్తూ తాము సృష్టిస్తున్న పరిధుల సంఖ్యల్నీ, పరిభ్రమణాల లెక్కల్నీ తెలియజేస్తున్నాయి. ఆలోచనల చైనుల్ని తెంపి, అవి సృష్టిస్తున్న పరిధుల్ని దాటి బైటపడలేకపోతున్నాడు అతను.

'రంగరాజూ! ఇదే నీ జీవితంలో ఆఖరిరోజు. నన్ను ఖూనీకోరుగా సృష్టించి జైలుకి పంపించిన నీ తెలివి ఏవిధంగా యివ్వాల్టి నీ చావునుండి తప్పిస్తుందో నేనూ చూస్తాను. నా జీవితానికి ఐదేళ్ళ సమాధికట్టి నన్ను నాశనంచేశావు. దానికి ప్రతీకారం చేసేవరకు నా ఆవేశం చల్లారదు. నాలోని ప్రతి అణువూ కసితో, నిన్ను మొదలంటా నాశనంచేయాలనే ప్రతీకార వాంఛతో నిండిపోయింది. ఆనాడు నన్ను ఖూనీకోరుగా ఆరోపించిన నీ ఆరోపణ యీనాటితో నిజం అవుతోంది. నీ ప్రాణాలు తీసి నిజంగా హంతకుడ్ని అవుతాను. అపవాదు రానేవచ్చింది. ఈనాడు నిజంగా నేను చేసిచూపించి బాహాటంగా నలుగురికీ చాటుతాను'.

తమ్మయ్యలో ఆవేశం ఉరకలువేసింది. కోపంతో పెదాలు బిగుసుకున్నాయి. మాటలు హృదయంలోనే ఒకదానితో ఒకటి ఢీకొని విరిగి ముక్కలు ముక్కలైపోయాయి.

లేకపోతే ఆ నిశ్శబ్దంలో ఆ కారునలుపు చీకట్లో అతని మాటల్లోని ఆవేశపు ప్రచండమారుతానికి ప్రతిప్రాణి జడిసి భయపడి గజగజలాడి ఎక్కడికో దూరంగా పిరికితనం కలుగుల్లోకి పారిపోయి దాక్కునేదే.

తమ్మయ్య మొలలో ఖైజారుతీసి పిడికిట్లో బలంగా బిగించి పళ్ళు పటపటా కొరికాడు. ఆ కొరకడంలో రంగరాజు బలమైన రోడ్డురోలరు చక్రాలకిందపడి నలిగి పిప్పయి ఎముకలు పెళపెళా విరిగిపోతున్నట్టు అనిపించింది.

తమ్మయ్య నడిచినడిచి ఊళ్ళోకి అడుగుపెట్టాడు. మరో రెండుమూడు రోడ్లు తిరిగి,ఒకచోట ఎదురుగా కనిపిస్తోన్న భవనం ముందుకొచ్చి నుంచున్నాడు. ఆ చీకట్లో, ఆ ప్రళయంలో ఆ భవనం మెర్క్యురీ బల్బుల్లో తెల్లగా వెలిగిపోతోంది. అందులో జనం సందడిగా అటూ యిటూ తిరుగుతున్నారు. అరడజను కార్లు యింటిముందు ఆగివున్నాయి.

కిందనుండి పైన ఏంజరుగుతున్నదీ లీలగా అవుపిస్తోంది. ఫలహారాల పళ్ళాలతో పనివాళ్ళు అద్దాల కిటికీలవెనక అటూయిటూ కదులుతున్నారు. మధ్యహాల్లో ఎవరో పాడుతున్నారు గాబోలు శ్రావ్యంగావున్న ఓ స్త్రీ కంఠం కిటికీలోనుండి బైటపడి గాలిలో తేలిపోతోంది. ఆ కంఠం కాండంచుట్టూ అనేక సన్నని వాయిద్యాల తీగెలు పెనవేసుకున్నాయి. ప్రశాంతమైన వాతావరణంలో అప్పుడప్పుడు చెలరేగిన అశాంతిలా వుండివుండి ఒక కుక్క కిందనుండి అరుస్తోంది.

తమ్మయ్య తను కనబడకుండా ఒక నీడలాంటి స్థలంలో గోడవారనే కూర్చున్నాడు. ఆవేశం గాలిఓడలా రెక్కలుకట్టుకుని ఎగురుతోంది. లూజు అయిన దాని ఆలోచనల సీలల్ని బిగించి కదలకుండా ఒకచోట ఆపివుంచాడు.

గంటసేపు అలానే కూర్చున్నాడు. లోపలివాళ్ళు బయటికి వెళ్ళిపోతోన్న జాడలేదు. వర్షం రావడంలేదుగాని గాలి చల్లగా వీస్తోంది. ఆ శీతగాలికి కళ్ళు మూతలుపడుతున్నాయి. బలవంతంగా నిద్రని తోలుకుంటున్నాడు. అయినా మెలమెల్లగా రెప్పలుజారి కళ్ళు మూతలుపడ్డాయి.

ఆ నిద్రలో అతని ఆలోచనలకు ప్రతిరూపాలుగా అతని భావాలు ఆకారాలు దాల్చి తెల్లని మనసు తెరమీద కదిలాయి.

రంగరాజు ఒక్కడే కూర్చుని నోట్ల కట్టల్ని లెక్క పెడుతున్నాడు. అతని యింటినిండా, ఒంటినిండా అన్నీ నోట్లే! అతను తొడుక్కున్న నల్లని బుష్‌కోటుమీద

తెల్లని రూపాయినోట్ల బొమ్మల్ని కత్తిరించి అంటించుకున్నాడు. అతని గది నాలుగు గోడలకు, పైన సరంబీకి, కింద గచ్చుకు రూపాయి బొమ్మల వాల్‌పోస్టర్లు అతికించబడివున్నాయి. ఆ గదిలో అలమారాలోని పుస్తకాల పుటలన్నీ వరసాగ్గా బైండు చేసిన రూపాయలనోట్లే! టేబిలుకింద చిత్తుబుట్టలో చిరిగిపోయిన నోట్ల ముక్కలు! ఎక్కడ చూసినా అన్నీ...అంతటా రూపాయల నోట్లే! ఆ నోట్లబెడ్‌మీద అతను నిద్రపోతున్నాడు. ఆ నోట్ల కుర్చీమీద కూర్చుంటున్నాడు. ఆ నోట్ల చిత్తు కాగితాలలో కాలుస్తున్న సిగరెట్ బూడిద దులుపుతున్నాడు.

తమ్మయ్య అడుగుల్లో అడుగులు వేసుకుంటూ దొంగచాటుగా వెళ్ళి వెన్నుమీద ఒక్కపోటు పొడిచాడు. ఆ దెబ్బతో రంగరాజు పాములా మెలికలు మెలికలు తిరిగి ప్రాణాలు వదిలి నేలమీద పడ్డాడు. 'పీడవదిలింది' అనుకుంటూ తమ్మయ్య వచ్చినదారివెంటే వెనక్కు వెళ్ళబోయాడు కాని అతని మనసులో ఏదో ఆశ మెదిలింది. వెనక్కు తిరిగివచ్చి ఆ రూపాయల నోట్లన్నీ ఏరుకొని ఖాళీవున్న చోట్లల్లా బట్టలనిండా కూరుకున్నాడు. మేడమెట్లు దిగకుండానే కిటికీలోనుండి ఒక్కదూకు దూకాడు. ఆశ్చర్యం!- కిందపడలేదు! గాలిలో తేలిపోతున్నాడు!! అలావెళ్ళి మనుషుల్లేని అడవిలో ఆగి రూపాయల్ని ఓమారు చూసుకున్నాడు. అన్నీ చిత్రంగా సంకెళ్ళల్లా అతన్ని ఎక్కడికక్కడ బంధించేసాయి! ఆ సంకెళ్ళను తెంచుకుందామని బలంకొద్దీ గింజుకుంటున్నాడు.

గట్టిగా తలకు ఏదో తగిలింది. కల కరిగిపోయింది.

గోడకాబోలు బలంగా నుదుటికి తగిలి బొప్పికట్టింది. కళ్ళువిప్పుకుని చుట్టూ చూశాడు. నల్లని సిరాబుడ్డిలో కూర్చుని చుట్టూ చూస్తున్నట్టుంది. నలువైపులా అంతా చీకటే.

ఎదుటి మేడ తెల్లగా దేదీప్యమానంగా దీపాలతో వెలిగిపోవడంలేదు. సన్నని కంఠంచుట్టూ వాయిద్యాలు దాగుడుమూత లాడడం లేదు. నిశ్శబ్ద ప్రకృతిలో ప్రాణులన్నీ నిద్రపోతున్నాయి. తను ఎక్కడున్నాడో తనకే తెలీక తడిమిచూసుకున్నాడు. గోడ తగిలింది. అంతకుముందు తను కూర్చున్న స్థలం అది! తను నిద్రపోయినట్టుగా గుర్తించి ఆదుర్దాగా ఒకసారి మొలతడుముకున్నాడు. ఖైజారు చేత్తో పట్టుకుని మెల్లగా లేచాడు. అడుగుల్లో అడుగులు వేసుకుంటూ మేడ వెనకభాగం చేరాడు. అక్కడ ప్రహరీగోడ ఎక్కడానికి కొద్దిగా వీలుగావుంది. బయటినుండి గంగరావిచెట్టు గోడవారనేవుంది. దాని కొమ్మలు ప్రహరీగోడ దాటుకుని లోపలకు వెళ్ళాయి.

తమ్మయ్య శబ్దంచేయకుండా చెట్టెక్కి ప్రహరీ దాటి లోపలికి ప్రవేశించాడు. పైనుండి కిటికీలోంచి సన్నని వెలుతురు చార నేలమీద పడుతోంది. నీటిగొట్టాన్ని ఆధారంచేసుకుని కిటికీదాటి గదిలో ప్రవేశించాడు.

గదిలో బెడ్‌లైట్ వెలుగుతోంది. అంతవరకూ పుట్టినరోజు పండగలో అలిసిపోయిన రంగరాజు లోకాన్ని మరిచి గాఢంగా నిద్రపోతున్నాడు. ఆ దగ్గర్లోనే మరో మంచంమీద అతని భార్యకూడా అదే స్థితిలోవుంది.

రంగరాజుని చూసీచూడగానే మీదపడి ఒక్కసారిగా కుత్తుకనులిమి గుండెల్లో ఒక్కపోటు పొడుద్దామనిపించింది. కాని అతను శరీరాన్ని కట్టెలా పడేసి సర్వాన్నీ మరిచి నిద్రపోతున్నాడు. నిద్రపోతున్నవాడిని చంపడం పౌరుషంకాదు. అతను వంటిమీద స్పృహలేని సమయంలో ప్రాణాలు తియ్యడానికికాదు తను వచ్చినది. తను ఛస్తున్నానని తెలిసి, ఆ చచ్చేముందు భయంతో గట్టుమీద పడేసిన చేపలా గిలగిలా కొట్టుకొంటూ బ్రతకాలనే ఆశతో ప్రాణభయంతో చెలగాటం ఆడుతుంటే, సంతోషంగా తను కళ్ళారా చూడాలి.

అందుకే తమ్మయ్య వెళ్ళి అతన్ని లేపాడు.

రెప్పలు విప్పకుండానే సగం నిద్రమత్తులోనే భార్య చెయ్యిగాబోలని తమ్మయ్య చేతిని గట్టిగా గుండెలకు అదుముకున్నాడు. బలంగా, మోటుగా ఎవరో గుండెలమీద అణచినట్టయ్యింది.

కళ్ళు విప్పి ఆశ్చర్యంగా చూశాడు.

తనపాలిటి యమధర్మరాజు గంభీరంగా చింతనిప్పుల్లాంటి కళ్ళతో గుచ్చిగుచ్చి చూస్తున్నాడు!

రంగరాజు వళ్ళంతా చెమటపట్టింది. నోటంట మాట రావడంలేదు. తనగుండెలకు అరంగుళం దూరంలో తమ్మయ్య చేతిలో మెరిసిపోతున్న కత్తి కదిలితే అంగుళం లోతు గుండెల్లోకి గుచ్చుకుపోయేట్టుగా వుంది.

రంగరాజు గుడ్లప్పగించి అలా చూస్తున్నవాడు చూస్తున్నట్టే వున్నాడు. కాని అతని హృదయపు గడియారంలో పిరికితనపు తుప్పుపట్టిన స్ప్రింగు సాగలేక తెగిపోయింది. వెనక్కు వాలిపోయి మంచంమీదకు ఒరిగిపోయాడు రంగరాజు.

'పిరికివాడు, చంపకుండానే గుండాగిచచ్చాడు! ఏదో అదృష్టంచేసుకున్నాడు.

లేకపోతే తమాషాగా ప్రాణాలతో చెలగాటం ఆడించి చంపేవాడిని. కత్తితేవడంకూడా అనవసరమయ్యింది' అనుకున్నాడు తమ్మయ్య.

గబగబా నీటిగొట్టం వెంబడే కిందకి దిగిపోయాడు. గంగరావి కొమ్మలు ఆధారంతో ప్రహరీ గోడమీదకు ఎక్కబోయాడు. చెయ్యిజారికిందపడ్డాడు. కొద్దిగా శబ్దం అయ్యింది. శబ్దాన్ని పసిగట్టినట్టుంది,స్తంభానికి కట్టిన గొలుసు తెంచుకోలేక అక్కడనుండే అరుస్తోంది కుక్క.

తమ్మయ్యకు శరీరంనిండా ముచ్చెమటలు పోశాయి. అతనికి తెలీకుండానే భయం ఆవరించింది. కిందపడ్డవాడు లేచి మళ్ళీ ఎగిరి కొమ్మ అందుకున్నాడు. ప్రహరీ గోడమీదకు దిగకుండానే అక్కడనుండి అవతలకు ఒక్క దూకుదూకాడు. ఇక అక్కడనుండి వెనక్కుచూడకుండా ఒకేపరుగుతో పావుగంటలో ఊరవతలకు వచ్చాడు.

రెండుమైళ్ళ దూరం పరుగెత్తడంతో శరీరం అలసిపోయి తూలిపోతోంది. కాస్సేపు ఏ తుప్పల్లోనో కూర్చుని ఆయాసం తీర్చుకుందామని ఆగి వెనక్కు చూసాడు.

వెనకనుండి చీకట్లను చీల్చుకొని కత్తుల్లాటి ఫోకస్ కాంతులు అతనివైపే పొడుచుకొస్తున్నాయి!

తమ్మయ్యలేచి మళ్ళీ పరుగెత్తాడుకాని లాభం లేకపోయింది. క్షణాల్లో జీపుమీద ఊరకుక్కల్లాటి ముఖాలతో పోలీసులు చుట్టుముట్టారు.

తమ్మయ్య చేతులందించి పోలీసు స్టేషనుకు నడిచాడు.

జడ్జిమెంటు జరిగింది. అంతా అయ్యాక జడ్జీగారు హంతకుడికి 'ఉరిశిక్ష' ప్రకటించారు.

తమ్మయ్యకు నవ్వొచ్చింది. "ఎందుకూ?" అన్నాడు అందరి ముఖాల్లోకీ, జడ్జిగారి కళ్ళల్లోకీ చూసి.

జడ్జిగారు కోపంతో కళ్ళెర్రచేసి ముఖం చిట్లించుకున్నారు.

ఈసారి జడ్జిగారి గుండెలూ, ప్లీడర్ల ముఖాలూ, అక్కడ కూర్చున్న జనం తలమీది వెంట్రుకలూ అదిరిపోయేట్టుగా భయంకరంగా నవ్వాడు తమ్మయ్య.

"ఎవరు హంతకులు? నేనా, రంగరాజా? అతడ్ని నాశనంచేద్దామనుకున్నాను. చంపాలని వెళ్ళాను. కాని చంపలేదు. పిరికివాడు. నన్ను చూడగానే గుండాగిచచ్చాడు! అతను నన్ను నాశనం చెయ్యాలనుకున్నాడు. హంతకుడిగా సృష్టించి వదిలేసే నన్ను

జైలుకి పంపించాడు. ఈరోజు నన్ను చంపాలనుకోకపోయినా, తను చచ్చి నన్ను చంపుతున్నాడు. ఇప్పుడు జవాబివ్వండి...ఎవరు హంతకులు? నేను అతన్ని చంపానా? అతను నన్ను చంపాడా?"

దానికి ఎవరూ జవాబివ్వలేదు. ఒకరి ముఖాలు ఒకరు చూసుకుని అంతా చిత్రంగా నవ్వుకుని లేచి వెళ్ళిపోయారు.

తనను తాను చూసుకుని తనుకూడా జాలిగా నవ్వుకున్నాడు తమ్మయ్య.

✪